నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, ఆదివారం 23 మార్చి 2025 | HYDERABAD




ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ టయోటా హైలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను శనివారం సినీ నటుడు నవదీప్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హర్షా టయోటా సీఈఓ ప్రకార్తిక్, వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ పాములపర్తి, మోడీ టయోటా సీఈవో రంగాచార్యులు, వైస్ ప్రెసిడెంట్ సుధీర్, ఫార్చ్యూన్ టయోటా వైస్ ప్రెసిడెంట్(సేల్స్) కె. రమణ పాల్గొన్నారు. -సిటీబ్యూరో

## క్యాబ్‌ల్లో నో ఏసీ!

నో ఏసీ క్యాంపెయిన్‌కు తెలంగాణ క్యాబ్ డ్రైవర్ల పిలుపు

రేపటి నుంచి నగరవ్యాప్తంగా ఉద్యమం



సిటీబ్యూరో: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 రోజులకు నాంపల్లి గ్రౌండ్‌లో గిగ్ అండ్ ఫ్లాట్‌ఫాం వర్కర్స్ యూనియన్‌తో సీఎం సమావేశం ఏర్పాటు చేసి డ్రైవర్లకు వాహన ఆధారిత యాప్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఏడాదిన్నర గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. దీంతో డ్రైవరన్నలు రోడ్డెక్కారు. నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి నగర వ్యాప్తంగా 'నో ఏసీ' నిరసన చేపడుతున్నారు. క్యాబ్ డ్రైవర్లు అందరూ నో ఏసీ నిరసనలో పాల్గొంటున్నట్టు తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ ప్రకటించింది. 'అధికారంలోకి రాకముందు ఎన్నికల ప్రచారంలో గిగ్ అండ్ ప్లాట్‌ఫాం వర్కర్స్ కోసం ప్రత్యేకంగా డిక్లరేషన్ చేసి సమస్యలు పరిష్కరిస్తామని మాటిచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చలేదు'. అని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ సలావుద్దీన్ అన్నారు.

# వారానికోసారి మంచినీళ్లు!

- పదేండ్లలో వేసవిలోనూ రోజు విడిచి రోజు నీటి సరఫరా
- ఇప్పుడు నల్లా రాక... బోర్లు పోయక.. ట్యాంకర్లు దొరక్క అవస్థలు
- నగరవ్యాప్తంగానూ ప్రమాదకరస్థాయిలో భూగర్భ జల మట్టాలు
- జలమండలి ట్యాంకర్లకు పెరిగిన భారీ డిమాండు
- అగ్గికి ఆజ్యంలా భయపెడుతున్న నాగార్జునసాగర్ నీటిమట్టం

## కుత్బుల్లాపూర్ ప్రాంతంలో ఉమ్మడి రాష్ట్ర పరిస్థితులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, మార్చి 22 (నమస్తే తెలంగాణ): చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఒక ఉమ్మడి కుటుంబం గతేడాది చివరలో గృహ ప్రవేశం చేశారు. పది రోజుల కిందటి వరకు కలల సౌధంలో సంతోషంగా ఉన్నారు. ఒక్కసారిగా ఇంట్లోని బోరు ఒట్టిపోయింది. బిల్డర్ 500 ఫీట్ల వరకు వేయడంతో అదనంగా మరో 300 ఫీట్లు వేయించారు. కానీ చుక్క నీరు రాలేదు. నల్లా కనెక్షన్ ఉన్నా వచ్చే నీళ్లు సరిపోవడం లేదు. దీంతో సమీపంలోనే రూ.20వేలు పెట్టి మరో ఇల్లు అద్దెకు తీసుకున్నారు. అక్కడా అదే పరిస్థితి. దీంతో రెండు రోజుల కిందటే రెండు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారు.

> కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అనేక ప్రాంతాల్లో వారానికి ఒకసారి జలమండలి మంచినీటి సరఫరా జరుగుతున్నది. పలు కాలనీల్లో బోర్లు రోజులో ఒక గంటపోసి ఆగిపోతుండటంతో జనం ఆ నీటితోనే సరిపెట్టుకుంటున్నారు. మరికొన్నిచోట్ల ఆ పరిస్థితి కూడా లేకపోవడంతో జలమండలి ట్యాంకర్ల వైపు చూస్తున్నారు. కానీ రోజుల తరబడి టోకెన్ నంబరు ముందుకు కదలక చివరకు రూ.1000-1500 వెచ్చించి ప్రైవేటు ట్యాంకర్లు తెచ్చుకుంటున్నారు.

> వెస్ట్‌జోన్ పరిధిలోని తదితర ప్రాంతాల్లోని జలమండలి ట్యాంకర్ ఫిల్లింగ్ కేంద్రాల్లో గత 20-25 రోజులుగా ట్యాంకర్లకు డిమాండు గణనీయంగా పెరిగింది. గతంలో కంటే ఇప్పుడు దాదాపు రెట్టింపు స్థాయిలో అధికారులు ట్యాంకర్లను ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నా.. డిమాండుకు అనుగుణంగా లేక ప్రైవేటు నీటి వ్యాపారం మూడు పూవ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతున్నది. ఈ ప్రాంతంలో దాదాపు 22వేల మంది పదేపదే జలమండలి ట్యాంకర్లను బుక్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది.



మేడ్చల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజలు

### తాగునీటి కోసం కాలనీవాసుల ధర్నా

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలోని 14వ వార్డుకు చెందిన బాలాజీనగర్, ఎంఆర్ఆర్ తదితర కాలనీలకు చెందిన ప్రజలు నీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మేడ్చల్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట శనివారం ధర్నాకు దిగారు. బాలాజీనగర్, ఎంఆర్ఆర్ కాలనీల్లో నీటి సమస్య తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాలకు నాలుగైదు రోజులకోసారి కూడా మిషన్ భగీరథ నీళ్లు రాని పరిస్థితి ఉందన్నారు. నీళ్లు లేని కారణంగా ఒక్కో రోజు స్నానం కూడా మానేయాల్సి వస్తున్నదన్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ తో నీళ్ల సమస్య అనేది లేకుండా చేసిందన్నారు. మిషన్ భగీరథ నీళ్ల రాక, ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరు సరిపోక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేయాల్సి వస్తున్నదన్నారు. అనేక సార్లు అధికారుల దృష్టికి నీటి సమస్య తీసుకువచ్చినా.. స్పందించకపోవడంతో ధర్నాకు దిగాల్సి వచ్చిందన్నారు. అనంతరం కమిషనర్ నాగిరెడ్డి కాలనీవాసులతో కార్యాలయ సమావేశ మందిరంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్, కాలనీ వాసులకు మధ్య వాగ్వివాదం జరిగింది. మూడు రోజుల్లో నీళ్ల సమస్య పరిష్కరించకపోతే రోడ్డెక్కి ఆందోళన చేస్తామని, కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కమిషనర్ ఇందుకు సమాధానమిస్తూ మూడు రోజుల్లో నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మిషన్ భగీరథ నీళ్లు తక్కువగా వస్తుండటంతో నీటి సమస్య తలెత్తుందన్నారు. ఇప్పటికే ఉన్న బోరు బావులను బాగు చేయిస్తామని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, వర్తక సంఘం నేత సుధాకర్ గుప్త, స్థానికులు శ్రీకాంత్, రాజశేఖర్ రెడ్డి, చకిలం చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, యతేంద్రనాథ్, నీలిమ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మహా నగరానికి మంచినీటి ముప్పు ముంచుకొచ్చిందనేందుకు కొన్ని ఉదాహరణ మాత్రమే ఇవి. భూగర్భజలాలు ప్రమాదకరస్థాయిలో పడిపోవడంతో పరిస్థితి నానాటికీ సంక్లిష్టంగా మారుతున్నది. అవుటర్ రింగ్ రోడ్డు వరకు దాదాపు 948 చదరపు కిలోమీటర్లలో సాంకేతిక నిపుణులతో జలమండలి జరిపిన సర్వేలో కేవలం 27 చదరపు కిలోమీటర్లు



మినహా, మిగిలిన 921 చదరపు కిలోమీటర్లలో భూగర్భ జలాలు ప్రమాద స్థాయిలో పడిపోయినట్లుగా తేలిందని సమాచారం. జలమండలి పరిధిలో మునుపెన్నడూలేని రీతిలో ట్యాంకర్ల డిమాండు పెరగడంతో అధికారులు ఈ సర్వే చేయించినట్లుగా తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో తాము గతంలో కంటే రెట్టింపు స్థాయిలో ట్యాంకర్లను పెట్టి సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ... అసలు ఈ పరిస్థితి అందునా ఎండా కాలం ప్రారంభంలోనే ఎందుకు వచ్చిందనేది ఇప్పుడు అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నది. గతేడాది హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి పరిధుల్లో సాధారణ కంటే ఎక్కువ వర్షపాతం పడినప్పటికీ ఈ పరిస్థితి రావడం అధికార యంత్రాంగాన్ని సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. ప్రధానంగా ఐటీ కారిడార్, కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా గతంలో కంటే 100-150 శాతం ఎక్కువ ట్యాంకర్లు బుక్ అవుతున్నాయంటే రానున్న రెండు నెలల పాటు పరిస్థితి ఇంకెంత ఘోరంగా ఉంటుందోనని అధికారులే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి అధికారులు (మిగతా IVవ పేజీలో)

## ఫ్లాట్ల కోసం పాట్లు

వాసవి గ్రూప్ కార్యాలయాన్ని చుట్టుముట్టిన కొనుగోలుదారులు

గడువు తీరినా ఫ్లాట్లను అందించని నిర్మాణ సంస్థ

సిటీబ్యూరో: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ వాసవి గ్రూప్‌పై కొనుగోలుదారులు తిరగబడ్డారు. డబ్బులు మొత్తం చెల్లించిన తర్వాత ఫ్లాట్లను అప్పగించకపోవడంతో ఆగ్రహానికి లోనయ్యారు. ఆ కంపెనీ చేతిలో ఇరుక్కుపోయిన వందలాది మంది కొనుగోలుదారులు బంజారాహిల్స్‌లోని రోడ్ నం. 12 కార్పొరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు. కొనుగోలు చేసిన ఫ్లాట్లను అప్పగించకుండా వేధిస్తున్నారంటూ మండిపడ్డారు. శనివారం కొనుగోలుదారులు, కార్యాలయానికి చొచ్చుకుని పోయారు. నివ్వెరపోయిన కంపెనీ నిర్వాహకులు... వారిని లోపలే ఉంచి సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు.మరింత ఆగ్రహానికి లోనైన కొనుగోలుదారులు... తమ ఫ్లాట్లను ఎప్పటిలోగా అప్పగిస్తారో తేల్చాలంటూ బైఠాయించారు. దాదాపు రెండున్నర గంటలపాటు సాగిన హైడ్రామాతో.. కస్టమర్ల తిరుగుబాటుతో వాసవి యాజమాన్యం నిర్ఘాంతపోయింది.

### ఐదు నెలలు గడువు ముగిసినా..

హఫీజ్‌పేట్ కేంద్రంగా నిర్మిస్తున్న వాసవి లేక్ సిటీ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టులో 2020లో ఫ్లాట్లను బుక్ చేసుకుని 80 శాతం వరకు డబ్బులు చెల్లించామని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2024 నాటికే పూర్తి చేయాల్సి ఉన్నా.. ఇప్పటికీ పనులు చేపడుతూనే ఉన్నారు. ఇప్పటికే ఐదు నెలలు గడువు ముగిసినా.. తమ ఫ్లాట్లను అప్పగించలేదని కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు.

> వాసవి సంస్థపై వస్తున్న ఆరోపణలతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతుండగా.. సగానికిపైగా డబ్బులు చెల్లించిన కొనుగోలుదారులందరూ కార్యాలయాన్ని ముట్టడించారు. ఉప్పల్ కేంద్రంగా నిర్మాణంలో ఉన్న వాసవి మెట్రోపోలిస్ కొనుగోలుదారులు కూడా ఆందోళనలో పాల్గొని.. తమకు అప్పగించాల్సిన ఫ్లాట్ల విషయంలోనూ జాప్యం చేస్తున్నట్లు ఆరోపించారు.

అయితే ఆందోళనకు దిగిన కొనుగోలుదారులను కార్యాలయంలో చర్చలు జరిపి.. శాంతింపజేయడంతో తమకు మరో గడువిచ్చి, ఆ లోగా ఫ్లాట్లను అందజేస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు. అయితే కార్యాలయాన్ని చుట్టుముట్టిన నేపథ్యంలో.. వాసవి గ్రూప్ ఈ అంశాన్ని బయటకు రాకుండా విశ్వప్రయత్నాలు చేసింది. కొనుగోలుదారులను లోపలికి అనుమతించి, ప్రధాన ద్వారాలు మూసివేసింది. అయితే భారీగా చేరుకున్న జనాలను చూసి కార్యాలయానికి పోలీసులు, మీడియా ప్రతినిధులపై కొనుగోలుదారులు అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మీడియాతో మాట్లాడేదేమి లేదని, అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ కొంతమంది కస్టమర్లు వాదనకి దిగారు. కాగా, వాసవి గ్రూప్ నిర్మాణాలపై వరుస వివాదాలు నగరంలో రియల్ ఎస్టేట్ రంగాన్ని మరింత ఆందోళనకు గురిచేస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

## ప్రకృతి సంపదపై బుల్డోజర్లు వద్దు

ఖైరతాబాద్, మార్చి 22 : జ్ఞానాలకు నిలయాలు ఉన్న స్థలాల్లో ప్రకృతి సంపదపై బుల్డోజర్లను ప్రయోగించవద్దని వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పూర్వ విప్లవ విద్యార్థుల రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రభుత్వం చేపట్టే విధ్వంసాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. గతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన భూములు హైకోర్టుకు కావాలని వంద ఎకరాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ లోని 60 ఎకరాల్లో పది ఎకరాలు ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వానికి అవగాహన లేకపోవడం పెద్ద విషాదమన్నారు. విశ్వవిద్యాలయాలు ఆరోగ్యంగా ఉంటే సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఉస్మానియా విద్యార్థులతో చర్చించి ఆ సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలన్నారు. సీనియర్ సంపాదకులు దేవులపల్లి అమర్, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్, కవి, రచయిత నందిని సిధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 400 ఎకరాలపై సర్కారు తప్పుడు ప్రచారం

సిటీ బ్యూరో: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలంపై ప్రభుత్వం విడుదల చేసిన ప్రెస్ నోట్‌లో ప్రస్తావించిన అంశాలన్నీ తప్పుల తడకలేనని జేఏసీ నేతలు ఆరోపిస్తున్నారు. హెచ్‌సీయూకు చెందిన 400 ఎకరాల భూమి వేలం కోసం యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌ను కలిసినట్లు ప్రెస్‌నోట్ ద్వారా ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్నదని అంటున్నారు.

## అక్రమ అరెస్టులతో సర్కార్‌ను నడపలేవు

బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు

సికింద్రాబాద్, మార్చి 22: 'అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని కొనసాగించలేవు రేవంత్ రెడ్డి' అని బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు హెచ్చరించారు. తనను పోలీసులు హైదరాబాద్ లో హౌస్ అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నిర్బంధ పాలన కొనసాగిస్తున్నారని మండి పడ్డారు. కాగా, ఓయూలో అప్రజాస్వామికంగా ఇచ్చిన సర్క్యులర్ ను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడిగినందుకు శనివారం ఓయూ పరిధిలోని వివిధ హాస్టల్లో విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ..తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి సర్క్యులర్ వెనక్కి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.



బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలును అరెస్టు చేసి పీఎస్‌కు తరలిస్తున్న పోలీసులు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఇలంబర్తి తదితరులు

## ఆ పదకొండే ఎందుకు..?

- అన్ని చెరువులను పరిరక్షించాలి
- మేయర్ తీరును తప్పుబట్టిన మజ్లిస్ కార్పొరేటర్లు

సిటీబ్యూరో: మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం బాహాబాహీగా జరిగింది. స్టాండింగ్ కమిటీ సభ్యుల మధ్య జరిగిన వాడీవేడి చర్చలో ఎంఐఎం ఒత్తిడికి మేయర్ తలొగ్గారు. హైకోర్టు ఆదేశానుసారంగా నగరంలోని 11 చెరువుల హద్దుల నిర్ధారణ, సుందరీకరణతోపాటు పరిరక్షణకు చేపట్టాల్సిన అంశాలపై చర్చకు స్టాండింగ్ కమిటీ అజెండాలో చేర్చారు. అయితే దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన మజ్లిస్ పార్టీ కార్పొరేటర్లు... పాత నగరంలో ఉన్న మొత్తం చెరువులను పరిరక్షించాలని, కొన్ని చెరువులను మాత్రమే ఎందుకు ఎంపిక చేశారని నిలదీశారు. అజెండాలో చేర్చిన అంశం కూడా అస్పష్టంగానే ఉందని వ్యాఖ్యలు చేయడంతో మేయర్, మజ్లిస్ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదానికి దారి తీసింది. ఈ విషయంలో హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తామని, ఎవరూ చెప్పిన వినేది లేదంటూ మేయర్ తేల్చి చెప్పినా.. ఎంఐఎం కార్పొరేటర్లు పట్టు విడవలేదు. దీంతో స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఓటింగ్ పెడతామంటూ మేయర్ చేసిన వ్యాఖ్యలు మరింత ఆందోళనకు కారణమయ్యాయి. స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ఓటింగ్ విధానం ఎక్కడిదనీ, కొత్తగా ఓటింగ్ ప్రక్రియ ఏంటనీ ఎంఐఎం కార్పొరేటర్లు అసహనం వ్యక్తం చేశారు. తమ సభ్యులు నలుగురు మాత్రమే ఉన్నప్పుడు ఓటింగ్ పెట్టి ఎవరిని తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారంటూ మేయర్‌పై మండిపడ్డారు. మీరేలా ఓటింగ్ పెడతారో చూస్తామంటూ తేల్చి చెప్పడంతో... అజెండా నుంచి చెరువుల పరిరక్షణ అంశాన్నీ తొలగించి సమావేశాన్ని నిర్వహించారు. వివాదం కాస్తా సద్దుమణగడంతో సమావేశంలో ఇతర అంశాలకు ఆమోదం తెలుపుతూ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఎల్బీనగర్ హయత్ నగర్ కార్పొరేటర్ ప్రోటోకాల్ వివాదం, ఎస్సీ, ఎస్టీ కేసు అంశంలో సమావేశంలో ప్రత్యేకంగా చర్చించారు. ఈ వివాదంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను మందలించారు. అభివృద్ధి పనుల విషయంలో స్థానిక కార్పొరేటర్‌కు కచ్చితంగా సమాచారం ఉండాలన్నారు. ఇదేవిషయంలో తరుచుగా ప్రోటోకాల్ వివాదాలు వస్తున్నాయని, అధికారుల తీరు మార్చుకోవాల్సిందే మేయర్ స్పష్టం చేశారు.

## అర్ధరాత్రి చీకట్లు!

పలుచోట్ల నిలిచిన విద్యుత్ సరఫరా

కూలిన 52 స్తంభాలు, దెబ్బతిన్న 20 డీటీఆర్‌లు

సుమారుగా రూ.3కోట్ల నష్టం జరిగినట్లు అంచనా



సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం రాత్రి వీచిన గాలులు, కురిసిన వర్షానికి పలుచోట్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. సిటీ పరిధిలోని దాదాపు 340కి పైగా 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇందులో ఎక్కువగా బంజారాహిల్స్‌లో 75, సైబర్‌సిటీలో 74, మేడ్చల్‌లో 64 ఫీడర్లు దెబ్బతిన్నాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా కరెంట్ సరఫరా ఆగిపోవడంతో నగరవాసులు కాల్‌సెంటర్లకు ఫోన్ చేశారు. పెద్దగా స్పందన లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 1920కి ఫోన్ చేసినా ఫలితం లేదని, సంస్థ ఇచ్చిన ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లకు చేస్తే వాళ్లు స్విచాఫ్ చేసుకున్నారంటూ ఉన్నతాధికారులకు చెప్పారు.


### రూ.3కోట్ల నష్టం..

గ్రేటర్‌లో ఈదురుగాలులు, వర్షానికి చాలాచోట్ల పోల్స్ పడిపోయాయి. డీటీఆర్‌లు అక్కరకురాకుండాపోయాయి. లైన్లు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి కనిపించింది. ఈ మొత్తం నష్టాన్ని ప్రాథమికంగా రూ.3కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, సిటీలో 52 పోల్స్ పడిపోయాయని, ఇందులో కొన్ని చోట్ల పోల్స్ మార్చేశామని, మరికొన్ని రిపేర్ చేసి వాటినే వాడామని చెప్పారు. ఇక 20వరకు డీటీఆర్‌లు దెబ్బతిన్నాయని, వీటి బదులు వేరేవాటిని తెచ్చిపెట్టినట్లు తెలిపారు. సుమారుగా 340కిపైగా 11 కేవీ ఫీడర్లు దెబ్బతినడంతో వాటిని పునరుద్ధరిస్తున్నారు.

### అర్ధరాత్రి నుంచి విధుల్లో ..

నగరంలో కరెంట్ సరఫరా నిలిచిపోయిన ప్రాంతాల్లో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖి నుంచి క్షేత్రస్థాయి లైన్‌మెన్ వరకు సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలు, ఏఈలు అందరూ క్షేత్రస్థాయిలో పునరుద్ధరణ చర్యలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పాల్గొన్నారు.

## తాగునీటిని వృథా చేస్తే 10 వేల ఫైన్




బంజారాహిల్స్: ఇష్టారాజ్యాంగా నీటిని వృథా చేసేవారిని, మంచినీటితో వాహనాలను కడిగే వారిని గుర్తించి భారీగా జరిమానాలు విధించాలని జలమండలి అధికారులను మేయర్ ఆదేశించారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నంబర్. 12 లోని ఎమ్మెల్యే కాలనీ వాసుల సమావేశంలో మేయర్ పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు అడుగంటడంతో నగర వ్యాప్తంగా చాలా ప్రాంతంలో జలమండలి నీటిపైనే ఆధారపడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కొందరు అవసరం ఉన్నా.. లేకపోయినా చీటికిమాటికీ వాహనాలు కడుగుతూ, పైపుల ద్వారా ఇంటి ముందు నీళ్లను వృథా చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై జలమండలి అధికారులు కఠినంగా ఉండాల్సిందేనని, వారిని గుర్తించి రూ. 10 వేల జరిమానా కూడా విధించాలని ఆదేశించారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కకుండా..

ముందస్తు సమాచారంతో మందుబాబులు తప్పించుకునే ప్రయత్నాలు

రోజుకు సగటున 170 కేసులు

యువతే ఎక్కువ



సిటీబ్యూరో: నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపే వారికి చెక్ పెట్టడానికి పోలీసులు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 21 వరకు మొత్తం 4865 కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీసులు చెప్పారు. పోలీసుల చేతికి చిక్కిన మందుబాబుల్లో 2వేల మంది 21-30 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారే కావడం గమనార్హం. మరోవైపు పోలీసులు తాము అనుకున్న స్థాయిలో టార్గెట్ రీచ్ కాలేకపోయామని అంతర్గతంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు కారణం మందుబాబులు తనిఖీల నుంచి తప్పించుకోవడంలో ఆరితేరిపోయారని పోలీసులే చెబుతున్నారు.

### మందుబాబుల ప్రయత్నాలు..

డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్స్‌లో పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు మందుబాబులు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట్లో తాము ప్రయాణించేదారిలో ఎక్కడైనా డ్రంక్ అండ్ డ్రైవ్ ఉందంటే వాహనాలు వెనక్కి తిప్పి జారుకునేవారు. అయితే పోలీసులు అటువంటి అవకాశం లేకుండా మూడు వైపులా దారి లేకుండా నాలుగో వైపు తాము ఉండి చెకింగ్స్ చేస్తుండడంతో ప్రత్యామ్నాయ మార్గాల కోసం వెతికారు. ఇందులో వాట్సాప్ గ్రూప్స్ ఎక్కువగా పనిచేశాయి. అప్పట్లో హైదరాబాద్ సిటీలో ఏరియాల వారీగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ప్రతిరోజూ ఎక్కడికక్కడ చెకింగ్స్ అవుతున్నాయో పోస్ట్ చేసేవారు. మధ్యలో పోలీసులు వాటిపై కూడా నిఘా పెట్టడంతో కొన్ని రోజులు ఆగిపోయినా తిరిగి అవే గ్రూపులు కంటిన్యూ అవుతున్నాయని తెలుస్తోంది. గ్రూప్ సభ్యులు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉండడంతో దాదాపు అన్ని ఏరియాలకు సంబంధించిన సమాచారం గ్రూపులో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతుందని ఒక అధికారి చెప్పారు. దీనివల్ల వాళ్లు తప్పించుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా, ట్రాఫిక్ పోలీసులు మందుబాబులతో ఎలాంటి సమస్య తలెత్తకుండా చెకింగ్ పాయింట్స్‌ను ముందుగానే పరిశీలించి ఎంపిక చేసుకుంటున్నామని అధికారులు తెలిపారు. ఇలాంటి ఏరియాలు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో పీఎస్‌కు ఐదు చొప్పున ఉన్నాయని వారు చెప్పారు. కాగా, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు మొదలుకాగానే మందుబాబులు ఎవరికీ వారు మెసెజ్ చేసుకోవడంతో చాలామంది ఈ తనిఖీల నుంచి తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది.